# పెంచిన ప్రేమే పెడదోవకు దారి

రచన:
"స్వప్నశ్రీ"

"నీ జిమ్మడి పోను! నా కొడుకు లేడని నీ యిష్టమొచ్చిన కూరలు వండెటట్టున్నావటే? కూడేమైనా కడుపులో కెళ్ళేలా" అంటూ కోడలు సుందరమ్మపై మండిపడింది అన్నం తింటున్న పాపమ్మ.

ఎప్పుడూ ముద్దముక్కేనా..ముంజూరు మెరిసిపోయిన యింకా దిట్టమైన తిళ్ళే కావాలి. "అని పసపస లాడుతూ లేచింది సుందరమ్మ భోజనాలు ముగిశాయి," ఎప్పుడు చుట్టాలతో కళకళ లాడే యింటికి యీ రోజు ఎవరు రాలేదే? ఏం చెప్మా-ఓహో! వారికూడా తెలుసు యీ దినము శుక్రవారము పవ్వ అప్పడాలు తప్ప యింకేమి దొరకవని అయినా యీ రోజు వస్తున్నానని ఉత్తరం వ్రాసిన చిన్నత్తయ్యకూడ రాలేదే" అని ఆలోచిస్తూ మిగిలిన భోజన పదార్థములను రిఫ్రిజిరేటర్‌లో పెట్టింది సుందరమ్మ.

టైమ్ మూడయింది. పత్రికలో కార్టూను చూచి సంతోషిస్తున్న సుందరమ్మ కాలింగ్ బెల్ మ్రోగడంతో గబగబా వచ్చి గేటు తాళం తీసింది. జిడ్డుదేరిన ముఖం అలసిన శరీరంతో సూట్‌కేస్ పట్టుకొని గుమ్మంలో నిలబడివున్న సరోజనమ్మను చూచి "రండత్తయ్యా! ఇంత ఆలస్యం అయ్యిందేం? లెటర్‌లో 12-30 గంటలకు వస్తానని వ్రాశారుగా" అని అడుగుతూ సూట్‌కేస్ అందుకొని లోపలకు నడిచింది సుందరమ్మ. సరోజమ్మగారంటే ఎంతో భక్తి శ్రద్ధలు ప్రేమాభిమానములు చూపిస్తూంది చిట్టమ్మ-ఒకవిధంగా సుందరమ్మకు ఆమె గురువు: వివిధ రకాల వంటకాలు చెయ్యుటలో మర్యాదలు నేర్పుటలో, చదువుకున్నను సంస్కారవంతురాలుగ తయారుచేయుటలో ఆమె చేసిన కృషికి సుందరమ్మ జీవితాంతము ఋణపడి యున్నది.

కాలకృత్యములు తీర్చుకొని ప్రయాణ బడలికతో సోఫాలో జారబడ్డారు సరోజమ్మగారు.

"అత్తయ్యా! అన్ని సిద్ధంగా పెట్టివున్నాయి. రండి భోంచేద్దురూ..." అని అంటూ బ్రతిమాలుతూ చెయ్యి పట్టుకొని లేవదీసింది సుందరమ్మ.

"తుఫానుకు వాల్తేరుసైడ్ లైన్లు పాడగుటవలన, వేరే గత్యంతరం లేక పాసింజర్ ట్రెయిన్ ఎక్కాను. నా ఖర్మ.కాలి అది మూడు గంటలు రైట్ టైమ్‌కు తరువాత (ఆలస్యంగా) వచ్చింది. దాని మూలంగా అన్నం తినే వేళ తప్పిపోయింది. ప్లాట్‌ఫారమ్ మీద కాఫీ తీసుకున్నాను. ఇప్పుడు ఆకలికూడ వేయుటలేదు. మరేమి అనుకోవద్దమ్మ" అని తగ్గుస్వరంలో చెప్పి సోఫాలో జారబడి భారంగా కనురెప్పలు మూసారు సరోజనమ్మగారు. క్షణాలలో లెమన్ జ్యూస్ తయారుచేసి తెచ్చి "నిమ్మరసమైనా తీసుకోండి. ఎండలో అలసిపోయి వచ్చారు" అని పలుకుతూ సరోజనమ్మగారి చేతి కందించింది చిట్టమ్మ.

పాపమ్మకు యీ చర్యలు చూచే సరికి కడుపు మండిపోయింది ఈర్ష్యతో. ఒక్క రోజయిన యీ విధంగా నన్ను చూడదే. జ్యూస్ కాదుకదా వేళకు అందించవలసిన కాఫీ నీళ్ళే నీళ్ళుకూడా ఇవ్వదే అడగకపోతే, స్వయాన నాకు పుట్టిన కొడుకు పెళ్ళామే అయినా దీనికి అంతయిదా అదంటే ...' అని అనుకుంటూ కోపాన్ని దిగమ్రింగుకో లేక ఏవగింపుతో 'తువ్ క్' మని నాలుగైదుసార్లు ఊసుకుంది పాపమ్మ.

'అత్తా! పిల్లలను జాగ్రత్తగా చూసుకో మేములా వెళ్ళొస్తాం' అని బాధ్యతను పాపమ్మ కప్పగించి చిన్నత్తాకోడళ్లు కలసి బయటకుపోయారు. మాటలు మాటలు నాకేసొక్కని తిరుగుతున్నాయి. ఎంత కాలముంటారో నేను చూడక పోతానా! దేవుడు చల్లగా చూచి నాకళ్ళే కనబడాలి గాని...' అని గొణుక్కుంటూ 'ఊఁ' అంది విసుగ్గా పాపమ్మ.

'అత్తా! చిన్ని ఎలాగుంది! మీతో తీసుకరాలేదే? అంతా బాగున్నారా' అని యింటి ప్రస్తావన ఎత్తింది సుందరమ్మ.

'చిన్ని పదే పదే అడిగానని చెప్పుమంది. నాతో తీసుకవచ్చేదాన్ని కాని పరీక్షలు జరుగుచుండుటవలన తీసుకరాలేదు. అబ్బాయి గుర్నాథం రాజమండ్రి వస్తాడుగా అప్పుడు వాడితో పంపిస్తానురా' అని చక్కగా నచ్చ జెప్పారు సరోజనమ్మగారు. అత్తయ్యా! చిన్నిని తప్పకుండా పంపాలి. ఇంటర్ ఫైనల్ యియర్ పరీక్షలు బాగా వ్రాస్తుందా...తరువాత నుండి సెలవులే కదా...తప్పకుండా పంపాలి. పంపించాలి...మర్చిపోకండి' అని సున్నితంగా పదిహేడేళ్ళ సుందరాంగన (అయిన) సుజనిత గూర్చి హెచ్చరించింది సుందరమ్మ నాల్గు రోజులలో పని పూర్తి కావించుకొని ప్రయాణమైన సరోజనమ్మగారికి.

'బాబ్జీ-టాటా పప్పలు కొనుక్కోరా' అని బూరిలా వున్న ఏడాది బుజ్జిగాడి బుగ్గలపై ముద్దుపెట్టి చేతిలో ఐదు రూపాయల కాగితం పెట్టి చెయ్యూపుతూ రైల్వేస్టేషన్‌కు రిక్షా ఎక్కారు సరోజనమ్మగారు.

బుజ్జిగాడి చెయ్యూపుతూ రిక్షా వెళ్ళిన వైపే చూస్తూండి పోయింది చంకలోనున్న పిల్లవాడితోపాటు సుందరమ్మ.

*    *    *    *

ఉదయం 37 మద్రాస్ జనతా ఎక్స్‌ప్రెస్‌కు రాజమండ్రి నుండి వచ్చిన అన్నా చెల్లెల్లను చూచి, హిమాలయాలం తెత్తు కెరటంలా ఆనంద సాగరంలో పరవళ్లు త్రొక్కుతూ, ఉత్సాహంతో టిఫిన్ త్వరగా తయారు చేయుటలో నిమగ్నమైంది. సుందరమ్మ.

గంటలో యోగక్షేమ సమాచారాలతోపాటు అల్పాహారాలు (ములు) భుజించుటకూడ పూర్తయింది.

వదిన మరదళ్లు సరదాగా కాలక్షేపం చేస్తున్నారు, అద్దాల బీరువా అంతా వార పత్రికలు, మాస పత్రికలు, దిన పత్రికలు, చందమామలతో సహా నిండిపోతూంది. సాయంకాలము షికార్లు, సినిమాలు, అడపదడప జరుగుతున్నాయి, రోజుకో మోడల్ దుస్తులతో. నవీన ఫేషన్లతో సుజనితను తీర్చి దిద్దుతూంది వదిన సుందరమ్మ.

'స్వంత ఆడబిడ్డయిన స్వర్ణలతకు సంవత్సరానికో చిన్న కోక గుడ్డ పెట్టుటకు కటకట లాడుతుందే? ఆ సిల్వర్ గుడ్డలు జరీబట్టలుకొని తొడిగిస్తూందీ పిల్లకు' అని సుజనితను చూచినప్పుడెల్లా యీసడించుకుంటూం దేడి పాపమ్మ. వదిన చూపే ఆదరాభిమానులకు మరీ సన్నిహితురాలైంది సుజనిత. విసుగనేది కలుగకుండా పుస్తకాలు, పిల్లలు-వారి స్పష్టాస్పష్ట మాటలతో, ముద్దులు కురిపించుటలో చక్కగా టైమ్ పాసవుతుంది సుజనితకు.

పేపర్‌లో పడిన రిజల్ట్స్ (పరీక్షా ఫలితాలు) చూచి సంతోషంతో వదిన, వదిన పిల్లలతో తక్షణం బయలుదేరి రాజమండ్రి వచ్చింది సుజనిత. సుజనిత ద్వితీయశ్రేణిలో కృతార్థురాలైంది. ఆ రోజు అది ఇల్లులా లేదు. ఇంద్రభవన మనుకో... డెకరేషన్ లాంప్స్‌తో ఇల్లు, డిన్నర్లు సినిమాలు ఒకటేమిటి!__ఎన్నో మాంచి జోరుగా సాగుతున్నాయి.

మరునాడు సంధ్య సమయంలో సుజనిత, సరోజనమ్మ, సుందరమ్మలు ఆంజనేయస్వామి, మార్కండేయేశ్వరుని గుడికి పయనమయ్యారు, భాగీరదీ తీరమున వెళ్ళిన తొందరగా చేరవచ్చుననే తలంపుతో తీరం వెంబడి నడక సాగించిరి. క్రొత్తగా నదిపై నిర్మిస్తున్న రైలు కమ్ రోడ్ బ్రిడ్జి-దాని సాంకేతిక పరకరములు, విజ్ఞానాత్మకముగా చూచేవారికి వింతగాను వుంటుంది. ఒకేచోట మూడు రకాల ప్రయాణ వాహనములు పడవ, రైలు, బస్సు ప్రయాణించటం విడ్డూరమే కదా! లీలగా కన్పిస్తున్న ఆనకట్టు-అచటి నుండి అనేక పాయలుగా విభజించబడిన గోదావరీనది, రవి అస్తమయ కాంతులకు నిగనిగలాడుతున్న రంగురంగుల చేపలు, ఫంటు మదుగా నది దాటుతున్న లారీలజత, ముమ్మరంగా రేవును చేరుతున్న రాధారి పడవలు, తెరచాప పడవలు, నావలు, వేగంగా చలించు లాంచీలు గల యీ సుందర దృశ్యమును ఒకేచోట ఒక్కసారి చూచునపుడు కలుగు యానంద మింతింతకాదు.

'వదినా ఎంత చక్కని చల్లని గాలి వేసవికాలమంతా గోదావరి దరిన వుంటే హృదయమెంత హాయిగా వుంటుందో' అని వివరించింది. సుందరమ్మకు - అలనాడు సాధ్వీమ తల్లి సీతమ్మనే మయ మరపించిన గోదావరీ తీర మలయమారుతముచే స్పర్శించబడిన సుజనిత.

'అత్తయ్యా! చిన్నని కాలేజి చదువులకు విజయవాడ పంపించండి. మీరా యిక్కడవుండరూ. ఎప్పుడు కోర్టు వ్యవహారాలు, బజారు పనులమీద తిరుగుతూంటారు. అందువలన చిన్ని ఆరోగ్యం క్షీణించవచ్చు. మీ అబ్బాయి మరీ మరీ పంప్మంచమన్నారు. నాకు తోడుగా వుంటుందికూడా' అని కొంచెం నొక్కి వక్కాణించింది సుందరమ్మ. కోడలుపైనున్న మమకారంలో 'అలాగే కానియ్' అని దిగులుగా పలికారు సరోజనమ్మగారు. ఆంజనేయస్వామి దర్శన భాగ్యం లభించిన సిదప ప్రసాదం స్వీకరించి సంతోషంతో మువ్వురు (ముగ్గురు) గృహోన్ముఖులైరి.

*    *    *    *

విజయవాడ మేరిస్ స్టెల్లా కాలేజిలో బి.యస్.సి, సి.బి.జెడ్ గ్రూపులో చేరింది సుజనిత. సుజనిత కాలేజి నుండి రాగానే కాఫీలు సేవించటం. ఆ తరువాత కలాసాగా కాలయాపన చెయ్యటం వదిన మరదళ్ళిద్దరికి పరపాటయ్యింది.

ఒకరోజు సాయంసమయమున నమస్తే ఆంటె (పిన్ని) అంటూ (గేటు తీసుకొని) లోల్లోకి ప్రవేశిస్తున్న సుందర యువకునికి సుందరమ్మ ప్రతి నమస్కారము చేసి, సుజనిత వైపు తిరిగి' యీాయన సత్యేంద్రకుమార్, బియస్.సి. మీ అన్నయ్య మిత్రుడు రాధాగోపాల్ ఆఖరి తమ్ముడు, డి. పి. అసిస్టెంట్ డైరెక్టరుగా పనిచేస్తున్నాడు. యీ మధ్యనే హుబ్లీనుండి యిక్కడకు ట్రాన్స్‌ఫర్ అయ్యాడు,' అని పంచ యోక్తులు పల్కింది.

'అలాగా' అని లేదించి లోపల కళ్ళాలని కాని నమ్రతగా 'నమస్కారమండి' అని చేతులు జోడించిన సుందరాంగునికి ప్రతి నమస్కారము చేయకుండా ఉండ లేకపోయింది సుజనిత. మా ఆడబిడ్డ సుజనిత బి.యస్.సి.

చదువుకుంటుంది' అని సుజనితను గూర్చి చెప్పింది. లతాంగన వెళ్ళిన దిక్కే చూస్తున్న సత్యేంద్ర కుమార్‌తో.

'అంకుల్ ఇంట్లో లేరా కేంప్ కెళ్ళారా?' అని అప్రయత్నంగా అడిగాడు ఏమరుపాటులో నున్న సత్యేంద్ర. 'ఫ్యూయల్ చెకింగ్ కోసం షోలాపూర్ డివిజన్ వెళ్ళారు సర్' అని సమాధానమిచ్చింది సుందరమ్మ. 'వెళ్ళోస్తానండి' అని చెప్పి శెలవు తీసుకొని బయలు దేరాడు సత్యేంద్రకుమార్,

వెళ్తున్న సత్యేంద్రకుమార్‌ని చూచి. 'సక్కా! ఎంత చక్కగా నడుస్తున్నవురా! నీ మాటల తీరు, మూర్తీభవించిన నీ సుందరవదనము మా సుజనితతో బంధమేర్పడితే ఎంత ముచ్చటనుంటోంది మీ జోడు, జంటను సతీపతులుగా చెయ్యాలి' అని మనోనిశ్చయము చేసుకున్నది సుందరమ్మ.

'ఏంటాంటే! ఇంకా రెడీ కాలేదా? పక్షం రోజుల తరువాత ఇంటిలోని కడుగెతూ సుందరమ్మ నుద్దేశించి అన్నాడు సత్యేంద్రకుమార్'—'అంటే, చిన్నీ సినిమాకు సిద్దంగా వుంటారు. నీవు తీసుకెళ్ళు? నాకు ఆఫీసువర్కు ఎక్కువగావుంది' అని ఆఫీసులో నాక్కనబడి చెప్పారు అంకుల్'

'ఎంతలో సక్కా! ఐదునిముషాల్లో వచ్చేస్తాం... క్విక్ చిన్నీ' అని సంతోషభరిత కంఠంతో పల్కి లోపలకెళ్ళింది సుందరమ్మ. 'అనుకొన్న కార్యం ప్రాప్తించుటకు యిదే మొదటి రంగం' అని తలంచుచు పారవశ్యముతో తొందరగా టాయ్‌లెట్ అయ్యింది. సుందరమ్మ,

థియేటలో 'సుకుమార్'తో సుజనిత, సుందరమ్మ సత్యేంద్రాలు వరుసగా ఆసీనులై తిలకిస్తూన్నారు. 'వంకలేనమ్మ డొంకలు వెతికిందన్నట్లు ప్రతీసారి ఏదో సాకు చెప్పుతూ బయటకు వస్తోంది సుందరమ్మ వారిని కలపాలనే నెపంతో: సుజనిత, సత్యేంద్రాన క్రీగంటి చూపులు లీలగా కలుసుకొంటున్నాయి. సినిమా ఇంటర్వెల్‌లో కావలని చవరి సీట్లో కూర్చుంది సుందరమ్మ, సుజనిత సంశయిస్తూ నిలబడింది. వదినమ్మను లేపితే చూచేవారికీ 'లీనీరియెన్స్', సభ్యతకూడ కాదని భావించి, అయిష్టాన్ని నటిస్తూ సత్యేంద్ర ప్రక్క సీట్లో ఆసీనురాలయింది సుజనిత. వారిరువుల చేష్టలను చూచి లోలోనే పరవశించి పోతూంది సుందరమ్మ. సినిమా విడచి పెట్టిన తర్వాత ముగ్గురు కులాసాగా కబుర్లు చెప్పుకుంటూ యిల్లు చేరారు. ఇద్దరిని అంకల్ కప్పగించి సుజనిత వేపు ఓరగా చూస్తూ వెళ్ళిపోయాడు సత్యేంద్ర.

డి. పి. అసిస్టెంటుగా మద్రాసు పోయినప్పుడు ఏదో ఒక గిఫ్ట్ తెస్తూండేవాడు సత్యేంద్ర—మాసానికి నాలుగు సార్లు పోయేవాడు. మద్రాసునుండి వస్తూ ఏపిల్స్ బుట్ట ఇంటికిచ్చి వెళ్ళిపోయాడు సత్యేంద్ర.

'రోటరీ పార్కులో కలవాలి' అని సుజనిత వ్రాసినట్టుగా అడ్రస్ చేస్తూ ఒక చీటిని సత్యేంద్రకు పంపించింది సుందరమ్మ.

"ప్రియమైన సుజనితకు సత్యేంద్ర వ్రాయునది:

ఆ రోజు సినిమాలో సంభవించిన సంఘటనతో నీలోని ఆకర్షణ శక్తి నా మనస్సు పదేపదే నీ వైపుకు చలింపజేస్తూంది, యివి తినుకొని కొంచెం నాకు మనశ్శాంతిని కలిగిస్తావని ఆశిస్తున్నాను. వీలు చూసుకుని సాయంకాలము తప్పకుండా రోటరీ పార్కులో కలుసుకోవాలి" అని చీటిమీద వ్రాసి ఏపిల్ పండ్లపై పెట్టింది సుందరమ్మ.

'సత్యేంద్ర యాపిల్స్ తెచ్చాడు బుట్టలో వున్నాయి తీసుకో' అని సాదరంగా పలికినది సుందరమ్మ. చీటిని చూచి—వదిన చూచి ఉంటుందనుకొని కోపాన్ని ప్రదర్శిస్తూ...'కొంచెం చనువుగావుంటే చాలు—ప్రేమా పెళ్ళి అని ఛస్తూంటాడు. యీ మగాళ్ళంతా ఇంతే' అని అరుస్తూ 'మీ సక్కు చేసిన ప్రభావం చూడు' అని చీటిని సుందరమ్మ మీదకు విసిరికొట్టింది సుజనిత.

ఏమి ఎరుగనట్టు చీటి తీసి చదివి, ఆందోళనాస్పదంతో వున్న సుజనితను చూచి 'ప్రేమించాడట యింకేం పెళ్ళి చేసుకో...అంతకంటె మంచి వరుడు దొరుకుతాడా' అని అతిశాంతంగా ఆహ్లాదాన్ని ప్రత్యక్షపరుస్తూ చెప్పింది సుందరమ్మ.

ఆ హితబోధతో అధరాలపై నవ్వులు వెల్లి విరంబూసాయి. నానాటికి వారి ప్రేమ దినదిన ప్రవర్థమానమగుచూ పరిణయము వరకు వచ్చింది.

* * * *

సుందరమ్మ అత్తమామలు ముఖ్యంగా పాపమ్మ చెప్పిన కొండెములు, ఆధారాలు కల్పించి బుజువుచేసిన తీరునుబట్టి సరోజనమ్మగారు పాత సంగతులను కలచి వేస్తూ సుందరమ్మపై విరుచుకు పడ్డారు. ఏదొక్కమాటను తీసుకొచ్చి దుర్భాషలాడుతూ కొనుటద్వారా కయ్యం ఘోరంగా విజృంభించ సాగింది, వారిద్దరి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గున మండిపోయేటట్లుంది పరిస్థితి. సుందరమ్మతో పోట్లాడి సుజనిత చదువు మాన్పించి రాజమండ్రి తీసుకెళ్ళింది సరోజనమ్మ.

'కుమార్తె ఎప్పుడూ ఏదో ఆలోచిస్తున్నట్లు పరిధ్యానంలో ఉండటం చూచి, నిజం గ్రహించక 'బంగారం లాంటి నా కూతుర్ని ఏదో చేసింది' అని సుందరమ్మను ఆడిపోసుకుంటుంది సరోజమ్మ. పెళ్ళిచేసిన సంతోషంగా జీవించుననే ఉద్దేశంతో ఏకైక పుత్రికకు పెళ్ళి నిశ్చయించింది సరోజనమ్మ.

వివాహం నిశ్చయమైందని తెలిసి, 'ప్రియుని: దూరమగుతున్నానే' అని వాపోయుచూ కుమిలి కృషించి పోసాగింది సుజనిత. తల్లితో నిజం చెప్పుటకు వెరచి (భయపడి) మౌనం వహించింది సుజనిత.

సుపుత్రిక విరసించుట చూచి సుజనిత తల్లిదండ్రులు శివస్వామి, సరోజనమ్మలు ముహూర్తం దగ్గఱలో పెట్టి సివిల్ ఇంజినీర్ కిచ్చి వివాహం జరిపించారు. శోభనం రోజు—శోభనం గది అతిశోభాయమానముగా తీర్చి దిద్దబడి పిండి వంటలతో ఘుమఘుమ లాడుతుంది, నూతన వరుడు వధువు కొఱకై ఎన్నో ఆశలతో కలలు కంటూ ఎదురుచూస్తూన్నాడు.

గతాన్ని మరువలేక సతమతమవుతుంది సుజనిత. ప్రియుని చర్యలు. ఆ మధుర వాక్కులు పదేపదే కళ్ళముందు, మనస్సులో మెదులాడటంతో ఆత్మ వంచన చేసుకోలేక మాతృమూర్తి పడబోయె అగచాట్లను గూర్చి ఒక్కసారి దుఃఖ సాగరంలో మునిగి లేచి లేని ప్రియుడ్ని 'చేరాలి' అనే ఆతృతితో శోభనం రోజునే పరారి అయ్యింది సుజనిత.



ఋషేంద్రమణి మనుమరాలు కుమారి భవాని రంగపూజ సలిపి భరతనాట్య ప్రదర్శన ఇచ్చింది.